క్లుప్తంగా

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడికి సత్కారం



అమలకంటి శ్రీనివాసరావును సత్కరించిన ఈఓ తదితరులు

సామర్లకోట: స్థానిక లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టరు అమలకంటి శ్రీనివాసరావును స్థానిక పంచారామ క్షేత్రంలో మంగళవారం సత్కరించారు. జిల్లాలోనే కాకుండా ఇతర ప్రాంతాల్లోను వరదలు వచ్చిన సమయంలో బాధితులకు భోజన ఏర్పాట్లు చేయడంతో పాటు ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వేదపరిషత్తు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈఓ బళ్ల నీలకంఠం, మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్ కంటే బాబు, విశ్రాంత ఈఓ పులి నారాయణమూర్తి, భక్త సంఘం నాయకులు చుండ్రు గోపాలకృష్ణ, గంజి బూరయ్య తదితరులు సత్కరించారు.

గిఫ్ట్ షాపులో చోరీ

సామర్లకోట: స్థానిక పెద్దాపురం రోడ్డులోని విఘ్నేశ్వరా థియేటర్ సమీపంలో ఉన్న ఆర్ఎల్ గిఫ్ట్ షాపులో చోరీజరిగింది. షాపు యజమాని నాలం శ్రీను ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా ప్రదేశానికి చేరుకొని సమాచారం సేకరించారు. పోలీసుల కథనం ప్రకారం...సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు షాపు షర్టర్ తాళాలు పగలు కొట్టి దొంగతానికి పాల్పడిన్నట్టు గుర్తించారు. షాపులో ఉండాల్సిన రూ.12వేల నగదుతో పాటు విలువై గిఫ్ట ఆర్టికల్స్ చోరీకి గురి అయిన్నట్లు శ్రీను తెలిపాడు. ప్రధాన రోడ్డులోనే తరచూ చోరీలు జరగడంతో షాపుల యజమానులు భయభ్రాంతులకు గురవుతున్నారు. రాత్రి సమయంలో పోలీసులు గస్తీ తిరుగుతూ సైరన్ కొడుతూ వెళ్లడంతో దొంగలు జాగ్రత్త పడడానికి అవకాశం ఉంటుందని విమర్శలు ఉన్నాయి. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎ.కృష్ణభగవాన్ తెలిపారు.

రామలింగేశ్వరునికి ఆరుద్ర నక్షత్ర పూజలు



ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వర స్వామివారు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలో ప్రసిద్ధిగాంచిన రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో మంగళవారం శ్రావణ మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు స్వామివారికి పూజలు, రుద్రాభిషేకం నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం సప్త హారతులు, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు ఆలయ సేవా సభ్యులు భక్తులు స్వామి వార్ని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



గణపతి ఆలయం వద్ద భజన సంకీర్తనలు ఆలపిస్తున్న బృందం

కొత్తపల్లి: గోర్సలోని గణపతి ఆలయ మొదటి వార్షికోత్సవ సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామత అభిషేకాలు చేశారు. ఆలయం వద్ద భజన సంకీర్తన కార్యక్రమాల్ని ఏర్పాటు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సీఎం పర్యటనపై దృష్టి సారించాలి

పెద్దాపురం/సామర్లకోట: ఈ నెల 23వ తేదీన సీఎం చంద్రబాబు పెద్దాపురం పర్యటనపై అధికార యంత్రాంగం దృష్టి సారించాలని కలెక్టర్ సగిలి షణ్మోహన్ అన్నారు. ఈ నెల 23వ తేదీ సీఎం పెద్దాపురం నియోజకవర్గ పర్యటన నేపథ్యంలో మంగళావారం ఆయన జిల్లా స్థాయి అధికారులు, ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్పతో కలిసి ప్రజావేదికకు అవరమైన స్థలాలను పరిశీలించారు. అనంతరం స్థానిక ఆర్డీఓ కార్యాయలయంలో ఏర్పాటు చేసిన అధికారుల సమీక్షలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన తేదీ ఖరారు కావాల్సి ఉందన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆయన పెద్దాపురం రానున్నారన్నారు. ముందస్తుగా కార్యక్రమానికి సంబంధించి అనువైన స్థలాలను పరిశీలించామన్నారు.

ఇంకా తగ్గని ఉధృతి

- కొనసాగుతున్న సుద్దగడ్డ వరద
- నీటిలోనే పంట పొలాలు, కాలనీలు
- కొత్త కాలనీకి తప్పని ఇబ్బందులు



గొల్లప్రోలులో నీట మునిగిన పంట పొలాలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలంలో సుద్దగడ్డకు వచ్చిన వరద ఉధృతి నాలుగో రోజు కొనసాగింది. వరద ఉధృతి తగ్గకపోవడంతో పాటు పెరుగుతుండడంతో లోతట్టు కాలనీలు పంట పొలాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. గొల్లప్రోలు కొత్త కాలనీ వద్ద సుద్దగడ్డ కాలువ నీటి ఉధృతి కొనసాగుతుండడంతో రాకపోకలు నిలిచిపోయి స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలువపై కట్టిన వంతెన పూర్తి కాకపోవడంతో నిచ్చెనలపై ప్రమాదకర పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటికి వరద ఉధృతి మాత్రం కొనసాగుతోంది. ఇది తగ్గడానికి మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉన్నట్టుగా, అధికారులు చెబుతున్నారు. గొల్లప్రోలు మండలాల్లో ఏలేరు, సుద్దగడ్డ తదితర ప్రధాన పంట కాలువలు పొంగి పొర్లుతుండడంతో పంట పొలాలు నీట మునిగాయి. పిఠాపురం మండలంలో పి.తిమ్మాపురం, జములపల్లి, రాయవరం, రాపర్తి, గొల్లప్రోలు మండలంలో లక్ష్మీపురం, చేబ్రోలు, సీతానగరం తదితర గ్రామాల్లో వరి పంట సుమారు 800 ఎకరాల్లో పీట మునగగా, సుమారు 170 ఎకరాల్లో పత్తి పంట నీట మునిగాయి. ఇతర వాణిజ్య పంటలు దెబ్బతింటున్నాయి. ముఖ్యంగా వెదజల్లే పద్దతిలో వేసిన వరి పంట పూర్తిగా నీట మునుగుతోంది. సుద్దగడ్డ కాలువ పొంగి ప్రవహిస్తుండడంతో గొల్లప్రోలు ఈబీసీ కాలనీ, కొత్త కాలనీ, సూరంపేట, అరుంధతీయపేట తదితర నివాస ప్రాంతాలు నీట మునిగి స్థానికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.



గొల్లప్రోలులో నీట మునిగిన వాణిజ్య పంట పొలాలు



చెరువుగా మారిన గొల్లప్రోలు అరుంధతీయపేట కాలనీ



గొల్లప్రోలు కొత్త కాలనీ వాసుల ఇక్కట్లు

బాలికల హక్కులను కాపాడుకోవాలి

జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ దుర్గారాణి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న దుర్గారాణి

పిఠాపురం: బాలికలకు ఉన్న బాలల హక్కులను కాపాడుకోవాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి సూచించారు. పిఠాపురం మండలంలోని ఫకీరుద్దీన్ పాలెం మండల ప్రజా పరిషత్ ప్రభుత్వోన్నత పాఠశాలలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్ లక్ష్మి ఆదేశాల మేరకు పిఠాపురం ప్రాజెక్ట్ సీడీపీఓ సీహెచ్ ఎస్‌కే దుర్గాదేవి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన బేటీ బచావో బేటీ పడావో అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని బాలల హక్కులను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు బాలల హక్కులు జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు అభివృద్ధి చెందే హక్కు పాల్గొనే హక్కులు ఉన్నాయన్నారు. వీటిని బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లైంగిక వేధింపులు, మంచి స్పర్శ చెడు స్పర్శ, బాలల సంబంధిత చట్టాలు, తెలిపి అత్యవసర పరిస్థితుల్లో బాలల హెల్ప్ లైన్ 1098కి కాల్ చేయాలని చైల్డ్ హెల్ప్ లైన్ 1098 పని తీరు గురించి తెలిపారు. ఈ నంబర్ కు సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతారన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు నరసింహమూర్తి, ప్రభాకర్, ఉపాధ్యాయులు అరుణ కుమారి, డి.రామకృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్త బి.రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

గంబూషియా చేపలతో దోమల నియంత్రణ



కొమరగిరిలోని మురికి నీటిలో గంబుషియా చేపలను వదులుతున్న వైద్య సిబ్బంది

కొత్తపల్లి: గంబూషియా చేపలను మురికి నీటిలో వదలడం వలన దోమలను నియంత్రించవచ్చునని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజ్ కుమార్ అన్నారు. కొమరగిరి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలో ఉన్న కొమరగిరి, గోరస, కొండెవరం, చిన్న కలవలదొడ్డి, పెద్దకలవలదొడ్డిలో ఉన్న మురికి కాలవల్లో మంగళవారం గంబూషియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చాపలను మురికి కాలువల్లో వదలడం వలన రోజుకు సుమారు 100 నుంచి 300 వరకు దోమల లార్వాను తింటుందన్నారు. డెంగి, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులను వ్యాప్తి చేసే దోమల లార్వాను తిని వాటి జనాలను తగ్గిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఎస్సైను ఆదర్శంగా తీసుకోవాలి



ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావును సత్కరించిన మానవహక్కుల సంఘ నాయకులు

సామర్లకోట: స్థానిక ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావును ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా మానవ హక్కుల సంఘ అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ అన్నారు. ట్రాఫిక్ ఎస్సై చేస్తున్న సేవలను గుర్తించి మంగళవారం స్థానిక పోలీసు అవుట్ పోస్టులో మానవహక్కుల సంఘం ఆధ్వర్యంలో గరగారావును సత్కరించారు. నిత్యం రద్దీగా ఉండే బస్సు కాంప్లెక్స్‌లోను, రైల్వే స్టేషన్ ఆవరణలోను ప్రతి రోజు దొంగతనాలు జరిగేవని అయితే ముఖ్య కూడలి ప్రదేశాలతో పాటు షాపుల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించి, దొంగలపై నిఘా పెట్టారని, ప్రయాణికులను అప్రమత్తం చేస్తూ మైక్ సెట్ ఏర్పాటు చేయించారన్నారు. తప్పిపోయిన చిన్నారులను గుర్తించడంతో పాటు, తన వంతు బాధ్యతగా రోడ్డుపై ఉన్న గోతులను పూడ్చించారని తెలిపారు. సోమవారం ఒక మహిళ ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నం చేయగా వెంటనే గుర్తించి పోలీసు స్టేషన్‌కు తరలించడంతో జిల్లా ఎస్పీ నుంచి కూడా అభినందనలు అందుకున్నారని అప్పలకొండ తెలిపారు. అటువంటి వ్యక్తిని సత్కరించడం తమ బాధ్యతగా భావించామన్నారు. ఈ కార్యక్రమంలో మానవహక్కుల సంఘ నాయకులు అళ్లకి శ్రీనివాసరావు, జుత్తుక అప్పారావు, కుంచే నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రాఫర్స్ దినోత్సవం



కొత్తపల్లిలో సీనియర్ ఫొటోగ్రాఫర్లను శాలువాలతో సత్కరిస్తున్న దృశ్యం



లూయిస్ డాగురే చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న యూనియన్ నాయకులు

సామర్లకోట: ప్రపంచ ఫొటోగ్రాఫర్ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. పట్టణ, మండల పరిధిలోని ఫొటోగ్రాఫర్స్ స్థానిక స్టేషన్ సెంటర్‌లో ఉషా సూడియో వద్ద కెమెరా సృష్టికర్త లూయిస్ జాక్విస్ మాండ్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. డాగురె పుట్టిన రోజును పురస్కరించుకొని ప్రతి ఏడాది ఫొటోగ్రాఫర్స్ దినోత్సవం జరుపుకొంటున్నామని ఫొటోగ్రాఫర్ దర్శిపాటి సత్యానందం తెలిపారు. ఈ సందర్భంగా డాగురే సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ సంఘ నాయకులు శ్రీను, రాము సూరిబాబు, తాళ్లపూడి దివాకర్, నాని తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: ప్రపంచ ఫోటోగ్రాఫర్ల దినోత్సవం మంగళవారం మండల ప్రొఫెషనల్ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానికంగా ఉన్న శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో ఫొటోగ్రాఫర్స్ దినోత్సవం నిర్వహించారు. కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ ఫొటోగ్రాఫర్లను అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ఫొటోగ్రాఫర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

పిఠాపురంలో..

పిఠాపురం: ప్రపంచ ఫోటోగ్రాఫర్స్ దినోత్సవాన్ని పిఠాపురం ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పిఠాపురంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో పిఠాపురం ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు అల్లంకి బాల సుబ్రహ్మణ్యం, గోపి, సురేష్, సూరిబాబు, శివశంకర్, నాని, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



డాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఫొటోగ్రాఫర్లు

డ్వాక్రా మహిళలకు అండగా ప్రభుత్వం



డ్వాక్రా మహిళలకు రుణాల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే చిన రాజప్ప

పెద్దాపురం: రాష్ట్రంలో డ్వాక్రా మహిళలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. స్థానిక మున్సిపల్ సెంటర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం డ్వాక్రా మహిళలకు రుణాల చెక్కులను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎం సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే చిన రాజప్ప మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న రుణ సౌకర్యాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని 39 డ్వాక్రా సంఘాల సభ్యులకు రూ.6.28 కోట్ల రుణాల చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, కొత్తెం కోటి, మొయిళ్ల కృష్ణమూర్తి, రేలంగి బుజ్జి, కొమ్మిరెడ్డి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



నురుకుర్తి సత్యనారాయణమ్మ(ఫైల్)

కరప: కోడలితో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యంపై బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు... కరప మండలం అరట్లకట్ట గ్రామానికి చెందిన నురుకుర్తి సత్యనారాయణమ్మ(50) ఈనెల 18వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కోడలు హిమబిందుతో చిన్న గొడవ పడింది. ఆ తర్వాత సత్యనారాయణమ్మ ఎవ్వరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. అరట్లకట్ట పరిసర గ్రామాల్లో, స్నేహితులు, బంధువుల గృహాల్లో గాలించినా ఆమె ఆచూకీ తెలియలేదు. ఆమె పెద్ద కుమారుడు నురుకుర్తి శివశంకర్ మంగళవారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, కరప ఎస్సై టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుల రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

కాకినాడ క్రైం: నగరంలోని గ్లాస్ హౌస్ సెంటర్‌లో ఉన్న యువసేన బ్లడ్ బ్యాంక్‌లో 90 మంది యువకులు రక్తదానం చేశారు. మొగలి తేజ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదాతలను శ్రీయువసేన వ్యవస్థాపకుడు డాక్టర్ బొల్లం సతీష్ అభినందించారు. కార్యక్రమంలో కరప డీజీ పీజీ సత్యనారాయణ పేద విద్యార్థుల చదువు కోసం రూ.10 వేలు యువసేన స్వచ్ఛంద సంస్థకు విరాళంగా ఇచ్చారు.

ఘనంగా కార్పెంటర్స్ డే



కార్పెంటర్లను సత్కరిస్తున్న దృశ్యం

బాలాజీచెరువు: కార్పెంటర్స్ డే వారోత్సవాల్లో భాగంగా ప్రముఖ హెచ్‌డీఎంఆర్ కంపెనీ యాక్షన్ టైసా సంస్థ జిల్లాలోని పలువురు కార్పెంటర్లను ఘనంగా సత్కరించింది. కాకినాడలో ఒక హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ వై.జనార్దనరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో వడ్రంగి కళ అనేది కనుమరుగైపోతోందన్నారు. ఈ కళను బతికించుకోవాలంటే వడ్రంగి కళాకారులు ఆధునికత వైపు అడుగులు వేయాలని సూచించారు. ప్రస్తుత కాలంలో అధునాతన పనిముట్లతో పాటుగా అధునాతనమైన మెటీరియల్స్‌తో చక్కగా తీర్చిదిద్దిన మెటీరియల్ సైతం మార్కెట్లో అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని సద్వినియోగపరచుకుని వినియోగదారులకు చేరువ చేసి సత్ఫలితాలను పొందాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన 200 మందికి పైగా కార్పెంటర్లకు 'టైసా సలామ్' అనే నినాదంతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఆథరైజ్డ్ డిస్ట్రిబ్యూటర్ అనుకుల అల్యూమినియమ్స్ ప్రొప్రైటర్ అనుకుల గాంధీ, సంస్థ స్థానిక ఎగ్జిక్యూటివ్ బొందల సంతోష్, జిల్లాకు చెందిన కార్పెంటర్ల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పరేషన్

- రేషన్ సరకుల కోసం ఇబ్బందులు
- సుమారు కిలోమీటరు దూరంలో రేషన్ దుకాణం
- వృద్ధులు, వికలాంగుల పాట్లు
- పట్టించుకోని అధికారులు



గత ప్రభుత్వంలో అధికారుల పర్యవేక్షణలో ఇంటి వద్దే రేషన్ సరకులు పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

కొత్తపల్లి: రేషన్ కోసం ప్రజలు పరేషనవుతున్నారు. రేషన్ దుకాణాలు దూరంగా ఉండడంతో తీసుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. గత ప్రభుత్వంలో రేషన్ సరకులు తీసుకునేందుకు ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రేషన్ పంపిణీ వాహనాలను ఏర్పాటు చేసి నేరుగా ఇళ్ల వద్దకే సరకుల పంపిణీ జరిగే విధంగా ఏర్పాటు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని నెలలకే వాహనాల ద్వారా రేషన్ పంపిణీ విధానాన్ని రద్దు చేసింది. దీంతో రేషన్ సరకులను తీసుకునేందుకు లబ్ధిదారులు రేషన్ షాపుల వద్ద పడిగాపులు కాయడంతోపాటు సరుకులను సుమారు కిలోమీటరు మోసుకుని వెళ్లే పరిస్థితి ఏర్పడింది. లబ్ధిదారుల ఇళ్లకు సమీపంలో కాకుండా దూర ప్రాంతాల్లో షాపులను ఏర్పాటు చేశారు. మండలంలోని మూలపేట ప్రకాష్‌నగర్, జగనన్న కాలనీకి సంబంధించి లబ్ధిదారులు సరకులను తీసుకోవాలంటే సుమారు కిలోమీటరు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. మూలపేటలో షాపు నంబరు 26లో 594, 27లో 572, 47లో 702 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఈ మూడు షాపులు ఒకే ప్రాంతంలో ఏర్పాటు చేయడంతో మిగిలిన ప్రాంతాల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

సరకుల్లో కోత

రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేసే సరకుల్లో లబ్ధిదారులకు కోత విధిస్తున్నారు. బియ్యం తూకం సమయంలో వారు ఏర్పాటు చేసుకున్న డబ్బాతో తూకం వేస్తున్నారు. నలుగురు లబ్ధిదారులు ఉన్న కార్డుదారులకు సుమారు 3–5 కేజీల వరకూ తక్కువగా వస్తున్నాయని లబ్ధిదారులు వాపోతున్నారు.

గతంలో ఇంటి వద్దే తీసుకున్నా



గత ప్రభుత్వంలో రేషన్ ద్వారా పంపిణీ చేసే సరకులను ఇంటి వద్దకే వ్యాన్ల ద్వారా తెచ్చి ఇచ్చేవారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత రేషన్ షాపుల వద్దకు వెళ్లి సరకులను తెచ్చుకునే పరిస్థితి ఏర్పడింది.

– వై.సత్యవేణి, గృహిణి, మూలపేట

ఇబ్బందులు పడుతున్నాం



రేషన్ సరకులను తెచ్చుకోవడానికి చాలా ఇబ్బంది పడుతున్నాం. సుమారు కిలోమీటరు దూరం వెళ్లి తెచ్చుకుంటున్నాం. దీంతో సరకులు తీసుకోవాలంటే షాపు వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– ఎం.సుబ్బులక్ష్మి, గృహిణి మూలపేట

షాపు ఏర్పాటు చేయాలి



రేషన్ సరకులు తీసుకునేందుకు వీలుగా ప్రకాష్ నగర్ కాలనీలో రేషన్ షాపు ఏర్పాటు చేయాలి. మా ఇబ్బందులను తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. దీనిపై ప్రజా ప్రతినిధులు అధికారులు దృష్టికి తీసుకువెళ్లారు.

– జి.సుబ్బు, గృహిణి మూలపేట

అందుబాటులో ఉండేలా చర్యలు

రేషన్ లబ్ధిదారులకు షాపు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రకాష్ నగర్, జగనన్న కాలనీ లబిధదారుల ఇబ్బందులపై తమ దష్టికి వచ్చింది. రేషన్ డీలర్ల షాపును మార్పు చేసేందుకు తహసీల్దారుకు దరఖాస్తు చేయమని చెప్పాం. 3 షాపులకు సంబంధించి లబ్ధిదారులకు ఆ ప్రాంతంలో అందుబాటులో ఉండి సరకులు పంపిణీ జరిగే విధంగా చర్యలు తీసుకుంటాం.

– వీరాస్వామి, మండల పౌరసరఫరాల అధికారి

మహా పురుషులు జన్మించిన పుణ్యభూమి

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): మన సంస్కృతిలో ధర్మ, అర్ధ, కామ, మోక్షాలకు ఎంతో ప్రాధాన్యం ఉందని సమన్వయ సరస్వతీ సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. స్థానిక సూర్య కళా మందిరంలో సరస్వతీ గాన సభ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సనాతన ధర్మ– శాశ్వత న్యాయం అనే అంశంపై రెండో రోజు ఆయన ప్రసంగించారు. మనది గొప్ప రుషి సంప్రదాయమన్నారు. అర్ధ, కామాలను ధర్మ బద్ధంగా సంపాదించాలన్నారు. దాని కోసం జీవితాలను త్యాగం చేసిన మహా పురుషులు జన్మించిన పుణ్యభూమి ఇదని, మన సంతానానికి సంపూర్ణ ఆయురారోగ్యాలు, సత్ప్రవర్తన ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సరస్వతీ గాన గౌరవ అధ్యక్షురాలు పెద్దాడ సూర్యకుమారి పాల్గొన్నారు.